సాక్షి
యాదాద్రి భువనగిరి
ఆదివారం ၊ 21 ၊ మే ၊ 2023



ముగ్గురి అరెస్ట్
గంజాయి తరలిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి కొంత సరుకును స్వాధీనపర్చుకున్నారు. - 8లో



తాళం వేసిన ఇళ్లే టార్గెట్గా..
తాళం వేసిన ఇళ్లనే టార్గెట్గా చోరీలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం 39°/27°
వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

భువనగిరి టౌన్: ఈ ఏడాది పదో తరగతిలో 7జీపీఏ పైన మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ మైనారిటీ, వికలాంగ విద్యార్థులు 2023–24 విద్యా సంవత్సరం గాను కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి జైపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ నెల 22వ తేదీ నుంచి జూన్ 3వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే వారికి తప్పనిసరిగా ధ్రువ పత్రాలు ఉండాలని సూచించారు. పూర్తి వివరాలకు జిల్లా ఎస్సీ సంక్షేమ కార్యాయలంలో సంప్రదించాలని కోరారు.

గోల్డ్‌మెడల్ సాధించిన కానిస్టేబుల్‌కు సన్మానం


కానిస్టేబుల్ అనిల్‌ను అభినందిస్తున్న డీసీపీ రాజేష్‌చంద్ర

చౌటుప్పల్: దక్షిణ కొరియా దేశంలో ఈ నెల 12 నుంచి 20 వరకు జరిగిన ఏషియన్ మాస్టర్ పసిపిక్ గేమ్స్‌లో బంగారు పతకం సాధించిన భువనగిరి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ అనిల్‌ను శనివారం చౌటుప్పల్‌లోని ఏసీపీ కార్యాలయంలో జరిగిన ప్రత్యే కార్యక్రమంలో భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ఇండియా జట్టు తరపున క్రీడల్లో పాల్గొన్న అనిల్ 3వేల మీటర్ల అథ్లెటిక్స్ విభాగంలో బంగారు పతకం సాధించడం తోపాటు 800 మీటర్ల విభాగంలో బ్రౌంజ్ పతకాన్ని కై వసం చేసుకోవడం గర్వకారణమన్నారు. దేశానికి పతకం సాధించి రాచకొండ కమిషనరేట్, యాదాద్రి భువనగిరి ప్రాంతానికి మంచిపేరు తీసుకువచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నూకల ఉదయ్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

వలిగొండలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదు

భువనగిరి టౌన్: జిల్లాలో శనివారం ఎండలు దంచికొట్టాయి. దీంతో వలిగొండలో అత్యధికంగా 43.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రెండవ స్థానంలో ఆత్మకూర్(ఎం) 42.8 నమోదు కాగా అత్యల్పంగా మోటకొండూర్‌లో 38.5 తక్కవగా నమోదైందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

బీటీ -3 పత్తి విత్తనాలు అమ్మితే చర్యలు


విత్తనాల దుకాణంలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఏఓ అనురాధ

వలిగొండ: బీటీ–3 పత్తి విత్తనాలు అమ్మితే విత్తన డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి(డీఏఓ) అనురాధ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని విత్తన, ఎరువుల దుకాణాల్లో మండల వ్యవసాయ అధికారి అంజనీదేవితో కలిసి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. షాప్‌లో స్టాక్ రిజిస్టర్లు, రశీదు పుస్తకాలను పరిశీలించి మాట్లాడారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని, కొనుగోలు చేసిన రైతులకు రశీద్ తప్పక ఇవ్వాలని సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్సులను రద్దు చేస్తామన్నారు. స్టాక్ రిజిస్టర్లను క్రమపద్ధతిలో నిర్వహించాలని షాపుల యజమానులకు సూచించారు.

దళితబంధు యూనిట్ల పరిశీలన


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, అధికారులు

రాజపేట: మండలంలోని లక్ష్మక్కపల్లి గ్రామంలో దళితబంధు పథకం ద్వారా లబ్ధిపొందిన లబ్ధిదారుల షాపులు, ఇతర యూనిట్లను శనివారం క్షేత్రస్థాయిలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్ పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీఓ జ్ఞాన ప్రకాశ్‌రావు, సర్పంచ్ ఇంజ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

వేడుకగా నిత్యకల్యాణం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు సంప్రదాయబద్ధంగా నిత్యారాధనలు కొనసాగాయి. వేకువ జామునే ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు శ్రీస్వామి వారికి సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం, సహస్ర నామార్చన, కుంకుమార్చన నిర్వహించారు. ఇక ఆలయ ముఖ మండపంలోని ఉత్సవమూర్తుల వద్ద సువర్ణ పుష్పార్చన వంటి పూజలు జరిపించారు. ప్రథమ ప్రాకార మండపంలో గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం జరిపారు. వేడుకగా నిర్వహించిన నిత్య కల్యాణానికి భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. సాయంత్రం జోడు సేవోత్సవం చేపట్టారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.


కల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు


తిలకిస్తున్న భక్తులు

విద్యుత్ కనెక్షన్లు వెంటనే ఇవ్వాలి

- అదనపు కలెక్టర్ దీపక్‌తివారీ

సాక్షి,యాదాద్రి: సీఎం గిరి వికాసం పథకంలో భాగంగా ఎస్టీ లబ్ధిదారులకు విద్యుత్ కనెక్షన్లు వెంటనే ఇవ్వాలని అదనపు కలెక్టర్ దీపక్‌తివారీ విద్యుత్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో గ్రామీణ అభివృద్ధి, విద్యుత్ శాఖల అధికారులతో సీఎం గిరి వికాసం పథకంపై నిర్వహించిన సమన్వయ సమావేశంలో మాట్లాడారు. సీఎం గిరి వికాసం పథకంలో భాగంగా అర్హులైన ఎస్టీ లబ్ధిదారులకు తవ్వించిన బోరుబావులకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ నాగిరెడ్డి, ఏపీడీ శ్యామల, ఇనాయత్ అలీ, ఖాజా హిదాయతుల్లా, విద్యుత్ శాఖ అధికారి శ్యామ్ కుమార్ పాల్గొన్నారు.

రేపటి నుంచి జిల్లా స్థాయి క్రీడలు

సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడా పోటీలు ఈ నెల 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు భువనగిరిలో నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ దీపక్‌తివారీ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ పోటీలు స్థానిక తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో నిర్వహిస్తున్నామని, అన్ని మండలాల నుంచి వచ్చే 653 మంది క్రీడాకారులకు వసతులు కల్పించాలని సూచించారు. అనంతరం జిల్లా క్రీడల అధికారి ధనుంజనేయులు, కమిషనర్ నాగిరెడ్డి, ఎస్జీఎఫ్ సెక్రటరీ స్టాలిన్ బాబుతో కలిసి క్రీడలు నిర్వహించే క్రీడ మైదానాన్ని పరిశీలించారు. క్రీడాకారులు 22 తేదీ ఉదయం 7:30 గంటలకు పాఠశాలకు వచ్చి రిపోర్ట్ చేయాలనికోరారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్‌తివారీ

తడిసిన ధాన్యం.. ఆందోళనలో రైతాంగం


మోత్కూరులో కొట్టుకుపోతున్న ధాన్యం


గుండాల : మాసాన్‌పల్లిలో తడిసిన బస్తాలు

మోత్కూరు: మోత్కూరులో శనివారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షానికి స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు, తూకం వేసి నింపిన బస్తాలు తడిసి పోయాయి. ధాన్యం కుప్పలు వర్షం వరదలో కొట్టుకపోయాయి. మార్కెట్ యార్డు ప్లాట్‌ఫామ్ కావడంతో వరదకు ధాన్యం కొట్టుక పోయిందని కొండాపురానికి చెందిన మల్లేశం ఆవేదన వ్యక్తం చేశారు. ముశిపట్ల గ్రామంలో భారీ ఈదురుగాలులకు గ్రామానికి చెందిన చిన్నగోని శాంత ఇంటి పైకప్పు సిమెంటు రేకులు లేచిపోయాయి. అలాగే శాగంటి రమేష్‌కు చెందిన ఇంటి గోడ కూలింది

అడ్డగూడూరు: అడ్డగూడూరు, లక్ష్మీదేవికాల్వ, ధర్మారంతోపాటు పలు గ్రామాల్లో శనివారం సాయంత్ర ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. లక్ష్మీదేవికాల్వలో ఇళ్లపైకప్పు రేకులు లేచిపోయాయి. స్తంభం కూలి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పలు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు, బస్తాలు తడిశాయి.

గుండాల: మండలంలో శనివారం వీచిన ఈదురు గాలులకు, వడగండ్ల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం బస్తాలు తడిసి ముద్దయ్యాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో గోదాములపై ఉన్న రేకులు రేచిపోయి పూర్తిగా ధ్వంసమయ్యాయి. గోదాములో వేసిన ధాన్యం బస్తాలు తడిసి పోయాయి. కాంటాలు ఆలస్యం కావడంతోనే కేంద్రాల్లో ఉన్న తమ ధాన్యం తడిసిందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

భువనగిరి: న్యాయవాదులు న్యాయ సంబంధమైన చట్టాలపై విషయ పరిజ్ఞానం పెంచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బాలభాష్కర్‌రావు అన్నారు. భువనగిరి పట్టణ శివారులోని వివేరా హోటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ ఆసోసియేషన్(ఐఎల్‌పీఏ) ఆధ్వర్యంలో న్యాయవాదులకు నిర్వహించిన వర్క్‌షాప్ ముగింపు సదస్సులో ఆయన మాట్లాడారు. న్యాయవాదులకు చట్టాలపై ఐఎల్‌పీఏ అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. ఈ సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగారం అంజయ్య, మాజీ అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, ఐఎల్‌పీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యాంసన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వీఎం.కృష్ణారెడ్డి, ఫ్యాకల్టీ హైకోర్టు న్యాయవాది శ్రీనివాస్, లత, ఏపీపీలు సౌజన్య, పద్మ, సీనియర్ న్యాయవాది సిద్దిరాములు, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా జడ్జి బాలభాస్కర్‌రావు

‘రీజినల్’ రచ్చ

రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలంటున్న రైతులు
- అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య పెరుగుతున్న మాటల యుద్ధం
- త్రిడీ నోటిఫికేషన్లు రాకుండా అడ్డుకోవాలని డిమాండ్

సాక్షి, యాదాద్రి: భువనగిరి జిల్లా పరిధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్మించ తలపెట్టిన రీజినల్ రింగ్ రోడ్డు అంశంపై రచ్చ కొనసాగుతోంది. హైదరాబాద్‌కు ఉత్తర భాగంలో నిర్మిస్తున్న అలైన్‌మెంట్‌ను భువనగిరిలో రైతులు వ్యతిరేకిస్తున్నారు. కొన్ని నెలలుగా భువనగిరి రైతులు వివిధ రూపాల్లో నిరసనలు తెలుపుతున్నారు. అయితే ఎన్నికల సమయం సమీపిస్తుండడంతో రీజినల్ రింగ్ రోడ్డు అంశాన్ని రాజకీయ పార్టీలు తమకు అనుకూల అస్త్రంగా మార్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. మొట్టమొదట నిర్ణయించిన అలైన్‌మెంట్ కాదని మరో అలైన్‌మెంట్ ప్రతిపాదించడాన్ని రైతులు కూడా తీవ్రంగా ఖండిస్తున్నారు. మున్సిపాలిటీని రెండుగా చీలుస్తూ పోతున్న ఈ అలైన్‌మెంట్‌ను మార్చాలని డిమాండ్ చేస్తున్నారు.

రాయగిరి రైతుల పోరుబాట

రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌పై భువనగిరి ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉంది. జిల్లా మీదుగా రూపొందించి తొలి అలైన్‌మెంట్ ప్రకారం తుర్కపల్లి, రాజాపేట, యాదగిరిగుట్ట, మోటకొండూరు, భువనగిరి, వలిగొండ మీదుగా చౌటుప్పల్ వరకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆ తర్వాత మరో నోటిఫికేషన్ తుర్కపల్లి, యాదగిరిగ్గు, భువనగిరి మున్సిపాలిటీ, భువనగిరి మండలం, వలిగొండ మీదుగా చౌటుప్పల్ వరకు అలైన్‌మెంట్ ఇచ్చారు. 59.33 కిలోమీటర్ల రోడ్డు వేయనున్నారు. ఇందుకోసం ఆయా మండలాల్లో 1,853.04 ఎకరాలను సేకరించడానికి నోటిఫికేషన్‌లు జారీ చేశారు. భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని రాయగిరి గ్రామం, భువనగిరి మండలంలోని వివిధ గ్రామాలు, వలిగొండ, చౌటుప్పల్ మండలాల్లో తాము పెద్ద మొత్తంలో భూములు కోల్పోతామని ఈ అలైన్‌మెంట్ మార్చాలని రాయగిరి రైతులు రాజీలేని పోరాటం చేస్తున్నారు.



భూ సర్వేను అడ్డుకుంటున్న రాయగిరి గ్రామ రైతులు (ఫైల్)

“ మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేశాం



రాయగిరి మీదుగా రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని భువనగిరి మున్సిపల్ కౌన్సిల్‌లో ఏకగ్రీవంగా తీర్మానం చేశాం. తీర్మానం ప్రతులను కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తాం. సీఎం నుంచి కేంద్ర ప్రభుత్వానికి నివేదికను పంపిస్తాం. రాయగిరి మీదుగా అలైన్‌మెంట్ రావడంలో నాకే సంబంధం లేదు. రాయగిరి రైతులకు అండగా ఉంటాను.
– పైళ్ల శేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే, భువనగిరి

“ సీఎం దగ్గరకు వెళ్లి మార్పించాలి



రాయగిరి మీదుగా వెళ్తున్న రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పుకోసం మున్సిపాలిటీ తీర్మానంతో వదిలిపెట్టకుండా ఎమ్మెల్యే సీఎం కేసీఆర్ వద్దకెళ్లి కేంద్రంతో చర్చించి మార్పించాలి. ఈ అలైన్‌మెంట్ వెనుక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్ర ఉంది. చిత్త శుద్ధి ఉంటే త్రిడీ నోటిఫికేషన్ రాకుండా చూడాలి.
– కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు

“ ముఖ్యమంత్రితో లేఖ రాయించాలి



రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని సీఎం కేసీఆర్‌తో కేంద్రానికి లేఖ రాయించాలి. కేవలం మున్సిపాలిటీలో తీర్మానం చేసి వదిలేస్తే సరిపోదు. త్రిడీ నోటిఫికేషన్ రాకముందే ఈ ప్రక్రియను ఎమ్మెల్యే పూర్తి చేయాలి. అలా చేస్తే నేను కూడా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి అలైన్‌మెంట్ మార్పు చేయిస్తా.
– గూడూరు నారాయణరెడ్డి, బీజేపీ సీనియర్ నేత

ఇప్పటికే మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం

రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పు చేయాలని భువనగిరి మున్సిపాలిటీలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఇప్పటికే జాతీయ రహదారి 163 విస్తరణ, కాళేశ్వరం ప్రాజెక్టు కాలువలు, యాదాద్రి రోడ్డు విస్తరణతో విలువైన భూములు కోల్పోయిన రైతులకు మరోసారి నష్టం వాటిల్లకుండా అలైన్‌మెంట్‌ను రాయగిరి మీదుగా కాకుండా మరోచోటు నుంచి మార్చాలని తీర్మానం చేశారు. మున్సిపాలిటీని రెండుగా చీలుస్తూ వెళ్తున్న రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ విషయంలో అధికార ప్రతిపక్ష పార్టీల మధ్యన ఆరోపణలు, ప్రత్యారోపణలు జరగుతున్నాయి. భువనగిరి ఎంపీగా కాంగ్రెస్ పార్టీకి చెందిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేగా బీఆర్‌ఎస్‌కు చెందిన పైళ్ల శేఖర్‌రెడ్డి ఉన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అలైన్‌మెంట్ మార్చాలంటే ఎంపీ, ఎమ్మెల్యేలు పాటుపడాలని రాయగిరి రైతులు కోరుతున్నారు. అయితే ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి చొరత తీసుకుని మున్సిపాలిటీలో తీర్మాణం చేయాలని ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్ నాయకులు కొంత కాలంగా పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం మున్సిపల్ కౌన్సిల్‌లో ఏకగ్రీవ తీర్మానం చేసి ప్రభుత్వానికి సిఫారస్ చేశారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారుల వద్దకు మున్సిపల్ తీర్మానం చేరడంపై ఇప్పుడు ప్రధానంగా చర్చ జరుగుతోంది. ఇప్పటికే భువగగిరి మినహా చౌటుప్పల్, యాదాద్రి కాలా పరిధిలో త్రీడి నోటిఫికేషన్‌లు జారీ అయ్యాయి. ఒక్క రాయిగిరికి చెందిన రైతులు పోరాటంలో భాగంగా భూమి సర్వేను అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులు పోలీసుల పర్యవేక్షణలో భూ సేకరణ పూర్తి చేసి నివేదికను నేషనల్ హైవే అథారిటీ అధికారులకు పంపించారు. అయితే ముఖ్యమంత్రి స్థాయిలో కేంద్రంపై ఒత్తిడి తేవాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

కొండపైన నిలువ నీడ లేక..


ప్రధానాలయం గోడ నీడలో సేదదీరుతున్న భక్తులు


ఎండలో బస్సు ఎక్కేందుకు గుమిగూడిన భక్తులు

- యాదాద్రీశుడి దర్శనానికి తప్పని ఇబ్బందులు
- బస్సులు ఎక్కాలంటే మండుటెండలో నిరీక్షణే..!
- తిరమాడ వీధుల్లో చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలంటున్న భక్తులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ప్రధానాలయం ఉద్ఘాటన జరిగి ఏడాది పూర్తయినా కొండపైన షెల్టర్లు లేక నిలువ నీడ కరువైంది. ప్రస్తుత వేసవిలో ఆలయానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 9గంటల నుంచే ఎండలు దంచి కొడుతుండడంతో యాదాద్రి కొండపై ఆలయ పరిసరాల్లో భక్తులు నిలబడలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇదిలా ఉండగా.. శని, ఆదివారాల్లో భక్తులు బస్సుల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. కొండపైకి వెళ్లేందుకు సరిపడా బస్సులు లేకపోవడంతోపాటు బస్సుల కోసం మండుటెండలో నిలబడి అవస్థలు పడున్నారు. క్షేత్రానికి వచ్చే తమ నుంచి డబ్బులు వసూలు చేయడం తప్ప.. కనీసం నీడ షెల్టర్ కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని భక్తులు ఆరోపిస్తున్నారు.

ఎండ తాపానికి ఆగమాగం..

ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో యాదాద్రి క్షేత్రానికి వస్తున్న భక్తులు ఎండతాపానికి ఆగమాగమవుతున్నారు. శ్రీస్వామి వారి దర్శనానికి వెళ్లేందుకు క్యూకాంప్లెక్స్‌లో నుంచి ప్రధానాలయంలోకి పోయేంత వరకు నీడ ఉంటుంది. పడమటి రాజగోపురం నుంచి ప్రసాదం కొనుగోలు చేయడానికి, అక్కడి నుంచి తిరిగి బస్టాండ్ సమీపంలోకి వచ్చేంత వరకు భక్తులు మండుటెండకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానాలయంతిరువీధుల్లో వేసిన స్టోన్ ఫ్లోరింగ్‌తో కాళ్లు కాలుతుండటంతో దానిపై భక్తులు నిలబడలేక పరుగులు పెడుతున్నారు. తిరువీధుల్లో మ్యాట్లు, కూల్ పేయింట్ వేసినప్పటికీ అవి కూడా కాలిపోతున్నాయి. కొండపైన కొంతభాగం వరకు వేసిన చలువ పందిళ్ల కింద వివిధ శాఖల అధికారులు, ప్రైవేట్ సెక్యూరిటీకి సంబంధిన వాహనాలను పెట్టుకుంటున్నారు.


కొండపైన వేసిన చలువ పందిళ్ల కింద పార్కింగ్ చేసిన వాహనాలు

కిందకు దిగాలన్నా ఇక్కట్లే..

శ్రీస్వామిని దర్శించుకున్న భక్తులు కొండకిందకు దిగాలన్నా ఇక్కట్లు తప్పడం లేదు. సమయానికి బస్సులు ఉండడం లేదు. వేలాది మంది భక్తులు బస్సుల కోసం కొండపైన బస్టాండ్‌లో ఎండలో నిల్చొని ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు ఒకేసారి బస్టాండ్ వద్దకు రావడంతో భక్తుల మధ్య తోపులాట జరుగుతోంది. ఇక.. కొండ కింద బస్టాండ్ వద్ద, రింగ్ రోడ్డులో, పాత గోశాల వద్ద మండుటెండలోనే బస్సుల కోసం భక్తులు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికైనా ఆలయ అధికారులు స్పందించి కొండపైన అన్ని ప్రాంతాల్లో నీడ సౌకర్యార్థం చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

బీబీనగర్: భువనగిరి నియోజకవర్గంలోని ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని మక్తా అనంతారం, వెంకిర్యాల, పల్లెగూడెం, ముగ్దుంపల్లి, గొల్లగూడెం, గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సకాలంలో ధాన్యం కొనుగోళ్లు చేయక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, మూసీ పరీవాహక ప్రాంతాలైన బీబీనగర్, వలిగొండ, పోచంపల్లి మండలాల్లో రైతులను మిల్లర్లు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని 5లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు చేయాల్సిరుండగా ఇప్పటి వరకు కేవలం 2లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కూడా కొనుగోలు చేయకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు సత్తిరెడ్డి, పీఏఈసీఎస్ వైస్ చైర్మన్ బాలకృష్ణ గౌడ్, ఎంపీటీసీ సభ్యులు రజితాఅమరేందర్‌రెడ్డి, వసంతబస్వయ్య, డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వెంకిర్యాలలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కుంభం

అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలని ధర్నా

భూదాన్‌పోచంపల్లి: మున్సిపాలిటీ పరిధిలోని శ్రీమిత్ర సాయిసౌధ వెంచర్‌లోని మున్సిపల్ భూముల అక్రమ రిజిస్ట్రేషన్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలోని నేతాజీ చౌరస్తాలో ధర్నా చేపట్టారు. అలాగే అఖిలపక్షం ఆధ్వర్యంలో బహిరంగ చర్చావేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ అక్రమ రిజిస్ట్రేషన్ల స్కామ్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త చిట్టిపోలు శ్రీనివాస్ ప్రమేయం ఉందని ఆరోపించారు. మున్సిపల్ పరిధిలో 10ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైందని, ఇందుకు సంబంధించిన ఆధారాలు కొయ్యడ శ్రీను అనే వ్యక్తి వద్ద ఉన్నాయన్నారు. కాగా మున్సిపల్ వైస్‌చైర్మన్ బాత్క లింగస్వామి, బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు పెద్దల చక్రపాణి, సామల మల్లారెడ్డి బహిరంగ చర్చకు వచ్చారు. అక్రమ రిజిస్ట్రేషన్లలో మున్సిపల్ పాలకవర్గం ఎవరి పాత్రలేదని చెప్పారు. వీటిపై విచారణ జరిపించాలని మున్సిపల్ కమిషనర్‌కు లెటర్‌కూడా రాశామన్నారు. అన్యాక్రాంతమైన భూముల స్వాధీనానికి తమవంతు సహకారం అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేశం, మండల పార్టీ అధ్యక్షుడు పాక మల్లేశ్, పట్టణకోర్‌కమిటీ కన్వీనర్ భారత లవకుమార్, గునిగంటి రమేశ్, భోగ విష్ణు, మోటె రాజు, గునిగంటి వెంకటేశ్, కుమార్, రావుల అనిల్, పాండు, చేరాల సుధీర్, బొడిగె లింగం, తంద వెంకటేశం, శ్రీను, సుభాష్, గణేశ్, చందు, సురేందర్‌రెడ్డి, బాబు, దానయ్య తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

క్లుప్తంగా

సిమెంట్ లారీ దగ్ధం



లారీలో ఎగిసిపడుతున్న మంటలు

మునగాల: సిమెంట్ లారీ క్యాబిన్‌లో ఆకస్మాత్తుగా మంటలు ఎగిసిపడ్డాయి. ఈ ఘటన జాతీయ రహదారిపై మునగాల మండల పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. లారీ డ్రైవర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నుంచి కేసీపీ సిమెంట్ లోడుతో హైదరాబాద్ వైపు లారీ బయలుదేరింది. మార్గమధ్యలో మండలంలోని ఆకుపాముల వద్ద లారీ రేడియేటర్ బాయిల్డ్ అయి ఒక్కసారిగా మంటలు లేచి క్యాబిన్‌లోనికి ప్రవేశించాయి. వెంటనే డ్రైవర్ కిందకు దూకి ప్రాణాలు కాపాడుకున్నాడు. స్థానికులు అగ్నిమాపక శాఖ సిబ్బందికిగ సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. కాగా, ఈ ప్రమాదం సంభవించిన సమయంలో జాతీయ రహదారిపై సుమారు రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

పిడుగుపాటుకు 34మేకలు మృతి

గుండాల: పిడుగు పాటుకు మేకలు మృతిచెందాయి. ఈ ఘటన మండలంలోని తుర్కలశాపురంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఉప్పల సత్తయ్య, ఉప్పల లింగమల్లుకు చెందిన 34 మేకలపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు బాధితులు తెలిపారు. సుమారుగా రూ.3.50 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా..

- చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్
- రూ.32లక్షల విలువైన 52 తులాల బంగారం, 34 తులాల వెండి, 3బైక్‌లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పీ



సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం : తాళం వేసిన ఇళ్లనే టార్గెట్‌గా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.32లక్షల విలువైన 52తులాల బంగారం, 34 తులాల వెండి, మూడు బైక్‌లు, రెండు సెల్‌ఫోన్లు, ట్యాబ్‌ను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఏడుగురు నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి నల్లగొండ ఎస్పీ అపూర్వరావు వివరాలు వెల్లడించారు. నల్లగొండ టూటౌన్, సీసీఎస్ పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందడంతో ఈనెల 15న పానగల్ బైపాస్‌లో వాహనాల తనిఖీ చేపడుతుండగా అనుమానస్పందంగా ఉన్న వ్యక్తిని విచారించగా కనగల్ మండలం యడవల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ రుద్రాక్ష శ్రీనుగా పోలీసులకు చెప్పాడు. అతన్ని విచారించగా తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్నట్లు విచారణలో ఒప్పుకున్నాడు. శ్రీనుకు తోడుగా కర్నూల్ జిల్లా కొత్తపేటకు చెందిన భాస్కర్‌రెడ్డి, నంద్యాల జిల్లా కేంద్రానికి చెందిన ఎల్కపాటి అరుణ్, అలియాస్ ఆరులతో కలిసి చోరీలకు పాల్పడుతున్నాడు. శ్రీను ఇచ్చిన సమాచారంతో మిగతా ఇద్దరిని కూడా అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

చోరీ సొత్తు కొనుగోలు చేసిన వారిపై కేసు

చోరీ చేసిన సొత్తును నలుగురు వ్యక్తులకు విక్రయించడంతో కొనుగోలు చేసిన ఏపీలోని రాయచోటి జిల్లాలోని పొద్దుటూరుకు చెందిన ఆలమూరు సంజీవ్‌రెడ్డి , హైదరాబాద్‌కు చెందిన 6వ నంబర్ చౌరస్తా ప్రాంతానికి చెందిన కాలవల శ్రవణ్ అలియాస్ మున్నా, ఖమ్మం జిల్లా కొత్తగూడేనికి చెందిన గురుజాల ఉదయ్‌కిరణ్, అలియాస్ ఉదయ్, కర్నూల్ జిల్లా సున్నిపెంట ప్రాంతానికి చెందిన సాంద్రపాటి ప్రేమ్‌కుమార్‌లకు విక్రయించాడు. చట్ట విరుద్ధంగా దొంగల నుంచి సొత్తు కొనుగోలు చేసిన వారిని కూడా అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. రుద్రాక్ష శ్రీనుపై గతంలో పీడీ యాక్టులో జైల్‌కు వెళ్లి వచ్చాడని, 50కి పైగా వివిధ స్టేషన్లలో కేసులు ఉన్నట్లు తెలిపారు. ఇటీవల నలగొండ టూటౌన్, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లలో 5 కేసుల చొప్పున, భువనగిరి టౌన్ పోలీస్ స్టేషన్‌లో 2 కేసులు చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో 3 కేసులు ఇబ్రహీంపట్నం , మహబూబ్‌నగర్ టౌన్, కడప టౌన్, పోలీస్‌స్టేషన్లలో ఒక కేసు చొప్పున మొత్తం 18 కేసులు ఉన్నట్లు తెలిపారు. కేసు పరిశోధనలో చాకచక్యంగా వ్యహరించిన టూటౌన్ సీఐ ప్రసాద్, సీసీఎస్ సీఐ జితేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు మహేందర్, వేమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, అజయ్, సైదులు, శంశుద్దీన్, శంకర్, బాలకోటి, విష్ణువర్ధన్ గిరి, రాంప్రసాద్, పాష, లింగారెడ్డి, కృష్ణలను అభినందించారు.

అనాజిపురంలో విషాదఛాయలు



నాగరాజు,సుధారాణి (ఫైల్)

పెన్‌పహాడ్ : అప్పులు తీర్చే మార్గం కనిపించగా సూర్యాపేట జిల్లా వాసి రంగారెడ్డి జిల్లాలో భార్య గొంతుకోసి ఆపై తానూ ఆత్మహత్య చేసుకోవడంతో స్వగ్రామం పెనపహాడ్ మండలం అనాజిపురంలో విషాదం అలుముకుంది. మృతుల బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండల పరిధిలోని అనాజిపురం గ్రామానికి చెందిన యర్కచర్ల హన్మయ్య-నర్సమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. పెద్ద కుమారుడు శ్రీనివాస్ మూగవాడు. చిన్న కుమారుడు యర్కచర్ల నాగరాజు (38)కు విద్యాబుద్ధులు నేర్పించారు. గ్రామంలో ఆర్‌ఎంపీగా సేవలందిస్తూ జీవనం సాగించేవాడు. తొమ్మిది సంవత్సరాల క్రితం ఖాసీంపేట గ్రామానికి చెందిన సుధారాణి(32)ని వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు జన్మించారు. పెద్ద కుమారుడు నాని 3వ తరగతి, చిన్నకుమారుడు చెర్రి 2వ తరగతి చదువుతున్నారు.

ఐదేళ్ల క్రితం వలసెళ్లి..

కుటుంబ అవసరాల కోసం నాగరాజు గ్రామంలో చేసిన అప్పులు అధికం కావడంతో వాటిని తీర్చేందుకు ఐదేళ్ల క్రితం రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాన్వాడకు కుటుంబంతో కలిసి వలసెళ్లాడు. అక్కడే ఆర్‌ఎంపీగా వైద్యసేవలు అందిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఊరిలో చేసిన అప్పులతో పాటు, పిల్లల చదువుతో పాటు కుటుంబ అవసరాలు పెరిగిపోయాయి. దీంతో అప్పులు తీర్చడానికి భార్యభర్తలు ఇబ్బందులు పడుతూ మనోవేదనకు గురయ్యేవారు. ఈ క్రమంలో నాగరాజు శనివారం తెల్లవారుజామున నిద్రిస్తున్న భార్య సుధారాణి గొంతు కోసి హత్య చేసి ఆపై తానూ ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు తెలిపారు. తెల్లవారుజామున చిన్నారులు నిద్రలేవగా అఘాయిత్యం వెలుగులోకి వచ్చిందని తెలిపారు. తల్లిదండ్రులు చనిపోవడంతో చిన్నారులు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. కాగా, పోస్టుమార్టం అనంతరం శనివారం రాత్రి మృతదేహాలు స్వగ్రామానికి చేరుకున్నాయని, ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు మృతుల బంధువులు తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

హుజూర్‌నగర్: నియోజకవర్గంలోని మఠంపల్లి, మేళ్లచెరువు మండలాల్లో ఇటీవల ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 370 కేజీల నల్లబెల్లం స్వాధీనం చేసుకుని, 1950 లీటర్ల బెల్ల పానకం ధ్వంసం చేశారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి ఒకరిని అరెస్ట్ చేశారు. శనివారం హుజూర్‌నగర్‌లో ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి దాడుల వివరాలు వెల్లడించారు. మఠంపల్లి మండలం రామచంద్రాపురం తండాలో ఎక్సైజ్ అధికారులు దాడి చేసి ఆంగోతు రంగా ఇంట్లో 300కేజీలు, ఆంగోతు శివ ఇంట్లో 70 కేజీల నల్లబెల్ల స్వాధీనం చేసుకున్నారు. ఆంగోతు శివను అరెస్ట్ చేశారు. ఆంగోతు రంగా, మంచ్యా తండాకు చెందిన బెల్లం సరఫరాదారు రూపావత్ రంగాలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అంతే కాకుండా జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు మేళ్లచెరువు మండలం వెల్లటూరు కాలనీలో దాడి చేసి 1,950 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ అధికారులతో పాటు స్థానిక ఎక్సైజ్ ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుబడిన నల్లబెల్లం బస్తాలతో ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి, సిబ్బంది

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



మహమ్మద్ మృతదేహం

కట్టంగూర్ : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెస్ట్ ముంబాయికి చెందిన మహమ్మద్‌ షోయబ్ (26) మూడేళ్లుగా హైదరాబాదులోని బంధువుల వద్ద ఉంటూ బట్టల వ్యాపారం చేస్తున్నాడు. వ్యాపార నిమిత్తం శనివారం బైక్‌పై హైదరాబాదు నుంచి విజయవాడకు బయలుదేరాడు. మార్గమధ్యలోని రామోజీ ఫిలింసిటీ వద్ద పానుగంటి జయరాం లిఫ్ట్ అడగ్గా బైక్ ఎక్కించుకొని విజయవాడకు బయలుదేరాడు. కట్టంగూర్ గ్రామ శివారులోకి రాగానే బైక్ అదుపుతప్పి హైవేకు ఎడమవైపు ఉన్న డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలై షోయబ్ అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్ వెనక కూర్చున్న జయరాంకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రమాదానికి అతివేగమే కారణమని పోలీసులు తెలిపారు. మృతుడి బంధువు వకీల్ అహ్మద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

తిరుమలగిరిలో న్యాయవాదిపై దాడి



న్యాయవాదిని పరామర్శిస్తున్న నాయకులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : గుర్తుతెలియని వ్యక్తులు ఓ న్యాయవాదిపై దాడి చేశారు. ఈ ఘటన తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధి అనాంతరం గ్రామ శివారులో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అడ్డగూడూరు మండలం పర్రెపాడు గ్రామానికి చెందిన న్యాయవాది పర్రెపాటి యుగేంధర్ ఉదయం తిరుమలగిరిలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి కారులో హాజరయ్యాడు. అనంతరం తిరిగి స్వగ్రామానికి బయలుదేరగా అనంతారం శివారులో దుండగులు దాడి చేశారు. కారు అద్దాలు ధ్వంసం చేశారు. యుగేంధర్ వెంటనే 100కు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు అతడిని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దాడి హేయమైన చర్య

న్యాయవాదిపై బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు దాడి చేయడం హేయమైన చర్య అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చెరుకు సుధాకర్, వైఎస్‌ఆర్ తెలంగాణ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏపూరి సోమన్న, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడిపాటి నర్సయ్య అన్నారు. శనివారం సూర్యాపేట ఏరియా ఆస్పత్రిలో యుగేంధర్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే వారిపై దాడులు చేయడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. నిందితులను అరెస్టు చేసి కేసులు నమోదు చేయాలన్నారు. వారి వెంట మండల పార్టీ అధ్యక్షుడు వై.నరేష్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అంబేద్కర్, ఎంపీటీసీ సభ్యుడు జమ్మిలాల్ తదితరులు ఉన్నారు.

తుంగతుర్తిలో అరాచక పాలన

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



యుగేంధర్‌ను పరామర్శిస్తున్న ప్రవీణ్‌కుమార్

సూర్యాపేట : తుంగతుర్తిలో అరాచక పాలన సాగుతోందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ధ్వజమెత్తారు. శనివారం సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండల అనంతారం గ్రామ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో దాడికి గురైన న్యాయవాది యుగేంధర్‌రావును సూర్యాపేట ఆస్పత్రిలో ఆయన పరామర్శించి మీడియాతో మాట్లాడారు. తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ నియోజకవర్గ ప్రజల హక్కులను కాలరాస్తూ దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. గతంలో నాగారం మండలం పస్తాల గ్రామం వద్ద పాల్వాయి నగేష్ అనే వ్యక్తిని కూడా ఇదే తరహాలో ఎమ్మెల్యే అనుచరులు దాడులు చేశారని తెలిపారు. కేసీఆర్ పాలనలో అరాచక పాలన నడుస్తుందని ఎమ్మెల్యే ఒక గుండాల ప్రవర్తిస్తున్నాడని ఆరోపించారు. ఎమ్మెల్యేపై ఎందుకు పీడీ యాక్టు పెట్టలేదని ఆయన ప్రశ్నించారు. ఎమ్మెల్యే పేరు చెప్పుతూ లాయర్‌పై దాడికి పాల్పడిన వ్యక్తులపై ఎందుకు కేసులు నమోదు చేయలేదన్నారు. ఈ దాడి వెనుక కేసీఆర్, కేటీఆర్ ఉన్నారని ఆరోపించారు. పోలీసులు అధికార బీఆర్‌ఎస్ నాయకులకు తొత్తులుగా పని చేస్తున్నారని విమర్శించారు. సూర్యాపేట ఎస్పీ, డీఎస్పీ, తుంగతుర్తి సీఐ, తిరుమలగిరి ఎస్‌ఐలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం తుంగతుర్తి బంద్‌కు బీఎస్పీ పిలుపునిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో ఆ పార్టీ అధికార ప్రతినిధులు జక్కని సంజయ్‌కుమార్, అరుణ క్వీన్, బొడ్డు కిరణ్, పిలుట్ల శ్రీనివాస్, బుడిగే మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తుర్కపల్లిలో బైక్ చోరీ

తుర్కపల్లి: గుర్తుతెలియని వ్యక్తులు బైక్ చోరీ చేశారు. ఈ ఘటన తుర్కపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన నక్షత్ర ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ తన బైక్‌ను శుక్రవారం రాత్రి ఆస్పత్రి బయట పార్క్ చేశాడు. ఉదయం ఆస్పత్రి ముందు బైక్ లేకపోవడంతో చోరీకి గురైందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాఘవేందర్‌గౌడ్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

భువనగిరి : వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన భువనగిరిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని అర్బన్‌నగర్‌కు చెందిన బండారి శంకర్ ఈ నెల 16న భార్యతో గొడవపడ్డాడు. అదే రోజు భార్య పట్టణంలోని రైతు బజార్‌కు వెళ్లింది. తిరిగి మధ్యాహ్నం 2గంటలకు ఇంటికి రాగా భర్త కనిపించలేదు. చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు బంధువుల ఇళ్లలో ఆరా తీసినా ఆచూకీ కనిపించలేదు. దీంతో బాధితురాలు ఈ నెల 18న పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తేజంరెడ్డి శనివారం తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగింత

నార్కట్‌పల్లి : పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు పది నిమిషాల్లోనే గుర్తించి బాధితుడికి తిరిగి అప్పగించారు. ఈ ఘటన నార్కట్‌పల్లిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మునుగోడు మండలం రత్తుపల్లి గ్రామానికి చెందిన లింగస్వామి చిట్యాల నుంచి నార్కట్‌పల్లికి బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో స్థానిక పెట్రోలు బంక్ సమీపంలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. వెంటనే బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్‌ఐ సైదాబాబు ఆధ్వర్యంలో పోలీసులు లొకేషన్ ద్వారా 10 నిమిషాల్లోనే ఫోన్‌ను గుర్తించి బాధితుడికి అప్పగించారు.

వందే భారత్ రైలులో వృద్ధుడికి గుండెపోటు

మిర్యాలగూడ అర్బన్: మనవరాలి పుట్టువెంట్రుకలు తీయించేందుకు తిరుపతికి వెళుతున్న వృద్ధుడు మార్గమధ్యలో గుండెపోటుతో మృతిచెందాడు. హైదరాబాద్‌లోని మీర్‌పేట్‌కు చెందిన ప్రభాకర్ (72) తన మనవరాలు పుట్టు వెంట్రుకలు తీయించేందుకు కూతురు, అల్లుడితో కలిసి శనివారం వందేభారత్ ట్రెన్‌లో తిరుపతికి బయలుదేరారు. నల్లగొండ దాటిన తరువాత ఒక్కసారిగా ఛాతిలో నొప్పి వస్తుందని చెబుతూనే ప్రభాకర్ కుప్పకూలి పోయాడు. దీంతో తోటి ప్రయాణికులు అతడికి సీపీఆర్ చేశారు. అనంతరం రైల్వే అధికారులు మిర్యాలగూడ స్టేషన్‌లో సిబ్బందిని అలర్ట్ చేసి అంబులెన్స్‌ను సిద్ధం చేశారు. మిర్యాలగూడలో వందే భారత్ ట్రెన్ స్టాప్ లేకున్నా స్పందించిన రైల్వే అధికారులు ట్రెన్‌ను నిలిపి వేశారు. ప్రభాకర్‌ను అంబులెన్స్‌లో పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురి అరెస్ట్

- చింతూరు నుంచి షోలాపూర్‌కు తరలిస్తుండగా అడ్డగూడూర్ మండలంలో పట్టుకున్న పోలీసులు
- రూ.42.15 లక్షల విలువైన 232 కేజీల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన భువనగిరి డీసీపీ



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రాజేష్‌చంద్ర

చౌటుప్పల్ : గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.42.15 లక్షల విలువైన 232 కేజీల సరుకుతో పాటు బొలెరో వాహనం, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. శనివారం చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర కేసు వివరాలు వివరాలను వెల్లడించారు. మహారాష్ట్రలోని షోలాపూర్ జిల్లా బర్షి తాలూకాలోని ప్రిగ్రి గ్రామానికి చెందిన భజరంగ్ శ్రీరంగ్ కరాడే వృత్తిరీత్యా లారీ డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఆర్థికంగా తీవ్రమైన ఇబ్బందులు తలెత్తడంతో డబ్బు సంపాదనకు అడ్డదారి వెతుక్కున్నాడు. అందులో భాగంగా తమ గ్రామానికే చెందిన డ్రైవర్‌లుగానే పని చేసే స్నేహితులైన సాగర్ శివాజీ వస్తాద్, సూయాష్ రాందాస్ సర్దేలను సంప్రదించాడు. అడ్డదారుల్లో డబ్బు సంపాదించుకుందామని చెప్పాడు. ఇందుకుగాను గంజాయిని అక్రమంగా రవాణా చేసే పథకాన్ని వివరించి వారిని ఒప్పించాడు. అలా వీరంతా కొంతకాలంగా గంజాయిని రవాణా చేస్తూనే ఉన్నారు.

స్వరాష్ట్రంలోనే విక్రయానికి ప్రాధాన్యం


నిందితులు గంజాయిని స్వరాష్ట్రంలో విక్రయించేందుకు ప్రాధాన్యత ఇచ్చారు. ఆ ప్రకారంగా షోలాపూర్‌కు రవాణా చేస్తున్నారు. ఏజెంట్ల ద్వారా చింతూరుకు వెళ్లి 232కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. దాన్ని 114ప్యాకెట్లుగా మార్చారు. వాటిని బ్యాగుల్లో నింపుకొని బొలేరో వాహనంలో లోడ్ చేశారు. అలా భద్రాచలం, మహబూబాబాద్, తొర్రూర్, తిరుమలగిరి, అడ్డగూడూరు, భువనగిరి, హైదరాబాద్ మీదుగా షోలాపూర్ వెళ్లేందు ముగ్గురు బయలుదేరారు. అందులో భాగంగా అడ్డగూడూరు మండలం చౌళ్ల రామారం గ్రామ శివారులో శుక్రవారం సాయంత్రం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అదే సమయంలో అటుగా వచ్చిన బొలేరో వాహనాన్ని చూసిన పోలీసులు అనుమానంతో తనిఖీ చేయగా గంజాయి గుట్టురట్టయ్యింది. అప్రమత్తమైన పోలీసులు వాహనంలోని గంజాయి బ్యాగులను, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసున్నారు. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టగా నిందితులు తమ అక్రమ దందా వివరాలు చెప్పారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.42.15లక్షలని పోలీసులు తేల్చారు. పట్టుబడిన నిందితులను నల్లగొండ జైలుకు తరలించారు. సమావేశంలో ఏసీపీ నూకల ఉదయ్‌రెడ్డి, రామన్నపేట సీఐ మోతీరాం, చౌటుప్పల్, అడ్డగూడూరు, మోత్కూర్, ఎస్‌ఐలు అనిల్, ప్రభాకర్, ఉదయ్‌కిరణ్, శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. కేసులో కీలకంగా వ్యవహరించిన పోలీసులను డీసీపీ అభినందించారు.

ఏజెంట్ల ద్వారా కొనుగోలు చేస్తూ...

భద్రాచలం సమీపంలో ఉన్న చింతూరులో సరుకును కొనుగోలు చేసేవారు. ఇందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాంబాబు, ఒడిషాకు చెందిన సుబ్రాలను ఎంచుకున్నారు. అందులో భాగంగా నిందితుల్లో ఒకరైన సుయాష్‌రాందాస్ సర్దాకు చెందిన బొలేరో వాహనంలో సరుకును రవాణా చేస్తున్నారు. ఎక్కడా ఎవరికీ చిక్కకుండా కొంతకాలంగా వ్యాపారాన్ని విజయవంతంగానే కొనసాగిస్తున్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

- పండ్ల తోటల రైతులకు కోదాడ డివిజన్ ఉద్యానవనశాఖ అధికారి అఖిల సూచనలు



నడిగూడెం : ఉమ్మడి నల్లగొండ జిల్లా రాష్ట్రంలోనే ఉద్యానవన పంటలకు పెట్టింది పేరు. దాదాపు 50 వేల ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేస్తున్నారు. దీనిలో సుమారు 30 వేల ఎకరాలు మామిడి, నిమ్మ 10 వేల ఎకరాలు, ఇంకా మిగతా పంటలైన బత్తాయి, జామ, సపోట, ఆయిల్ పామ్, బొప్పాయి, కొబ్బరి, తదితర తోటలు సాగవుతున్నాయి. ప్రస్తుత వేసవిలో ఈ పంటలపై అగ్ని ప్రమాదాల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. వాటి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. అగ్ని ప్రమాదాల వలన వీటికి సంబంధించిన పరికరాలు సైతం కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. వీటి సంరక్షణకు రైతులు పాటించాల్సిన జాగ్రత్తలపై కోదాడ డివిజన్ ఉద్యానవనశాఖ అధికారి అఖిల చెబుతున్న సలహాలు ,సూచనలు.



నడిగూడెం మండలం కరివిరాలలో దగ్ధమైన నిమ్మ తోట

- రైతులు తోటల మధ్యలో పాదులు, పరిసరాల్లో ఏడాది పొడవునా పూతకు వచ్చే కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలి.
- మొక్కలు, చెట్ల మధ్య అంతర సేద్యం చేయడంతో పాటు, దున్నాలి.
- బిందు, తుంపర సేద్యం పరికరాలను శుభ్రం చేసుకొని, వాటిని రోలర్ సహాయంతో లేటర్స్ చుట్టుకొని సంరక్షించుకోవాలి.
- తోటల చుట్టూ కంపచెట్లు, ఎండిన పొదలు, ఆకులు, అలములు, చెత్త, ఎండిన కొమ్మలు లేకుండా జాగ్రత్త వహించాలి.
- ఫెన్సింగ్ ఇనుకముళ్ల తీగ, జీవకంచెగా అవిసి, కరోండా (కలెంకాయలు), కిత్తనారలను తోట చుట్టూ పెంచుకోవాలి.
- ఎండిన ఆకులు, కొమ్మలు, పొదలు తదితరాలను వారానికి ఒకసారి ఎండాకాలం ఉదయం సమయంలో ఒకసారి శుభ్రం చేయాలి.
- లేత తోటలలో పాదుల్లో బొబ్బర్లు, జనుము, తదితర పంటలను సాగు చేసుకోవాలి.
- అన్ని తోటలలో చెట్ల పాదులలో బిందు సేద్యం ద్వారా నిరంతరం తేమ ఉండేటట్లు చూసుకోవాలి.
- రైతులు సమీప అగ్నిమాపక కేంద్రం ఫోన్ నంబర్లను దగ్గర ఉంచుకోవాలి. ప్రమాదం సంభవిస్తే వెంటనే వారికి సమాచారం అందించి సకాలంలో తోటలను రక్షించుకోవాలి.